సాగునీటి ప్రాజెక్టుల ఘనత బొడ్డేపల్లికే దక్కుతుంది

మాజీ ఎంపి విశ్వనాథం

విశాలాంధ్ర-పలాస : జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావుకే దక్కుతుందని మాజీ ఎం.పి కె.విశ్వనాథం అన్నారు. బొడ్డేపల్లి రాజగోపాల రావు శతజయంతి ఉత్సవాలు పలాస కళింగ సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం కాశీబుగ్గ గాలిమేడలు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న విశ్వనాథం మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించి జిల్లా ఖ్యాతిని నలుదిశలా విస్తరించారని అన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన కృషి ఎనలేనిదని అన్నారు. సహకార రంగంలో చెక్కెర కర్మాగారం జిల్లాలో నెలకొల్పడంలో ఆయన సేవలు మరువలేనివని అన్నారు. శతజయంతి ఉత్సవాలు నిర్వహణ కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తే కలకాలం గుర్తు పెట్టుకుంటారు అనేందుకు రాజగోపాలరావు జిల్లా పట్ల అంకిత భావంతో చేసిన సేవ నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, వజ్రపుకొత్తూరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి, జై ఉత్తరాంధ్ర పార్టీ అధ్యక్షులు మెట్ట రామారావు, పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబూరావు, దవ్వాడ శ్రీహర్ష, చాపర వేణుగోపాల, లఖినాన కిశోర్, వాయిలపల్లి మాధవరావు, బమ్మిడి నాగేశ్వరరావు, బడ్డ నాగరాజు, పాలవలస వైకుంఠరావు, పైల చక్రధర్, మన్మధరావు, ఎస్.ధనుంజయలు పాల్గొన్నారు.

రాజగోపాలరావు సేవలు మరువలేనివి

- కళింగ సామాజికవర్గ అభివద్ధి ప్రధాత... - ఘనంగా రాజగోపాలరావు జయంతి

- నివాళులర్పించిన ఎస్ఎస్ఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : కాళింగ సామాజిక వర్గ అభివద్ధికి దివంగత నేత బొడ్డేపల్లి రాజగోపాలరావు చేసిన సేవలు మరువలేనివని ఎస్ఎస్ఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం కొత్తరోడ్డు జంక్షన్‌లోని బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి పూలమాపల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు సార్లు ఎంపీగా పని చేసి జిల్లాకు మంచి సేవలు అందించారని గుర్తు చేశారు. రాజగోపాలరావు ఆరు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై జిల్లా ప్రగతికి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. శ్రీకాకుళానికి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించి కేంద్ర ప్రభుత్వం వద్ద వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధుల మంజూరుకు కృషి చేసిన వ్యక్తి రాజగోపాలరావు అని అన్నారు. ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలోనూ ఆయన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. వంశధార ప్రాజెక్టుకు అప్పటి ముఖ్యమంత్రి సంజీవయ్య చేత శంకుస్థాపన చేయించారన్నారు.

మృతిచెందిన గొర్రెలకు పోస్టుమార్టం

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం పాలతలం గ్రామంలో కర్రి అప్పన్న కు చెందిన గొర్రెలు మృతి చెందటంతో, పశుసంవర్ధక అధికారులు ఆదివారం పోస్టుమార్టం నిర్వ హించారు. వికటించిన వ్యాక్సిన్ 15 గొర్రెలు మృతి, మరో 32 గొర్రెలకు అస్వస్థత అనే శీర్షిక విశాలాంధ్ర దినపత్రికలో ఆదివారం వార్త వెలువడిన సంగతి తెలిసినదే. ఈ మేరకు స్పందించిన టెక్కలి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రఘునాధరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఏ డి టి ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ కిషోర్ పశు వైద్య సిబ్బంది పాలతలగా వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. పాలతలగాం సచివాలయంలో పశు వైద్య శాఖ అసిస్టెంట్ స్రవంతి షిప్ ఫాక్స్ వ్యాక్సిన్ బాటిల్ ఇవ్వడంతో గొర్రెలు రైతులు స్వయంగా వ్యాక్సినేషన్ వేసుకున్నారని, సిబ్బంది చేయాల్సి ఉండగా బయటకు ఎందుకు ఇచ్చారు తెలియదని టెక్కలి పశు వైద్యశాఖ ఏడి రఘునాద్ తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.. అలాగే అస్వస్థతకు గురైన గొర్రెలను కాపాడేందుకు వైద్యం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా గొర్రెల యజమాని కర్రీ అప్పన్న తన జీవనాధారం గొర్రెల పెంపకం అని, గొర్రెలు మృత్యువాత పడటంతో తన కుటుంబం వీధిన పడిందని అధికారులు ముందు వాపోయారు.

స్థానిక సంస్థల పట్టబద్ధుల ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఓటర్లలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : స్థానిక సంస్థలు, పట్టబద్రుల ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లాలో నాలుగు పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేయడమైనదని, ఇందులో పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస ఆర్డీఓ కార్యాలయం, శ్రీకాకుళం ఆర్డీఓ కార్యాలయాలు ఉన్నట్లు చెప్పారు. పట్టబద్రుల ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టబద్రుల ఓటర్లు 56,256 మంది నమోదు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఓటర్లు 776 మంది ఉన్నట్లు వివరించారు. స్థానిక సంస్థల ఓటర్లకు ఇప్పటికే ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసి పోలింగ్ కేంద్రాలను తెలియజేసినట్లు స్పష్టం చేశారు. పట్టబద్రుల ఓటర్లకు దాదాపు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పట్టబద్రుల ఎన్నికలకు టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస ఆర్డీఓ కార్యాలయం, శ్రీకాకుళంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో పిఓ, ఎపిఓలు, ఇతర సిబ్బంది, రిజర్వు సిబ్బంది అంతా పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పోలింగ్ సిబ్బందికి ఏ విధమైన కొరత లేదన్నారు. సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకొని పోలింగ్ ఏర్పాట్లు చేసుకుంటానని తెలిపారు. ఒక గంట ముందు అభ్యర్థులకు సంబంధించి ఏజంట్లు చేరుకోవాలని, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, ఎలక్షన్ కమీషన్ సూచనల ప్రకారం పోలింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా ఓటరు స్లిప్పు అందకపోతే, తమ పోలింగు కేంద్రాన్ని తెలుసుకొని ఓటరు గుర్తింపు కార్డు తీసుకువెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. అంతకు ముందు టిపిఎం స్కూల్ లో ఎన్నికల ఏర్పాట్లను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

25 కేజీల గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తుల అరెస్టు

విశాలాంధ్ర-పాతపట్నం : ఆంధ్ర ఒడిశా పాతపట్నం బోర్డర్ సరిహద్దులో గల చెక్ పోస్ట్ వద్ద ఆదివారం సాయంత్రం సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న పాతపట్నం ఎస్సై ఎన్. కామేశ్వరరావు, ఆయన బృందానికి ఒడిశా నుంచి గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఈ మేరకు సీఐ ఎం.వినోద్ బాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం లో మాట్లాడుతు. ఒడిస్సా రాష్ట్రంలోని గజపతి జిల్లా మోహన బ్లాక్ దింగసురగి, గుడ్రిపదర్ అనే గ్రామాలకు చెందిన ముకుంద నాయక్, శంభోమాలిక్ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయిని మోహన బ్లాక్ నుంచి పాతపట్నం మీదుగా విజయవాడకు తరలిస్తున్నట్లు నిందితులు విచారణలో తెలిపారని సిఐ ఎం.వినోద్ బాబు విలేకరులకు తెలిపారు. వీరిద్దరూ నువాగడ సమితి, పోయిపదర్ గ్రామానికి చెందిన ఐబోరైతో అనే వ్యక్తి వద్ద కిలో వెయ్యి రూపాయలు చొప్పున 25 కేజీల గంజాయిని కొనుగోలు చేశామని విచారణలో నిందితులు తెలిపారన్నారు. వీరిద్దరూ కలిసి విజయవాడలో ఉంటున్న రమ్మో రైతో అనే వ్యక్తికి 3000 రూ/ కి గంజాయి అమ్మకానికి తీసుకు వెళ్తున్నట్లు అంగీకరించారన్నారు. రమారైతో కూడా నువగడ సమితి నువాసాయి గ్రామానికి చెందిన వాడని వెల్లడించారు. (ఓఆర్05ఎక్యూ) 9841 నంబరు గల యూనికార్న్ బైక్ పై గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. ఆయనతోపాటు ఎస్సై ఎన్.కామేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర -వజ్రపుకొత్తూరు : మండలంలో వజ్రపుకొత్తూరు ఎంపిపి పాఠశాలల్లో సోమవారం నిర్వహించ నున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లును రెవిన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలో గల పట్టభద్రుల ఓటర్ల ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పరిశీలనలో ఆర్.ఐ పవిత్ర, విఆర్‌వో తిరుమలలు ఉన్నారు.

ప్రజల పార్టీ... వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

మంత్రి డా.సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలస : ప్రజల పార్టీ వైసీపీ పార్టీ అని, ప్రజాధారణే వైసీపీ పార్టీ అభివృద్ధి అని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం పలాస ప్రగతి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైసీపీ పార్టీ జెండాను ఆవిష్కరించి వై.ఎస్.ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పార్టీ ప్రజల పార్టీ అని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి పెట్టిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేటికి 12 సంవత్సరాలు పూర్తి చేసుకుందని అన్నారు. ప్రజల ఆధారణాభిమానాలే వైసీపీ పార్టీ ఇంత ఘన విజయం సాధించిందని అన్నారు. కార్యక్రమంలో పులి రాజు, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంపిటిసి, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేత బాతుపురం పెదవంక

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : చినవంక మనోజ్ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో బాతుపురంచినవంక విజేతలుగా నిలిచింది. అక్కుపల్లి, బైపల్లి, చినవంక, డోకులపాడు, బాతుపురం పెదవంక జట్లు పాల్గొనగా చివరకు బాతపురంచినవంక విజేతలుగా గెలుపొందగా రన్నర్‌గా డోకులపాడు, ఇప్పిలి విజయ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, కృష్ణకు మ్యాన్ ఆఫ్ ధి సిరిస్ దక్కించుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు స్థానిక జిల్లా పరిషత్ భాలుర పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఆదివారం సిద్ధం చేశారు. 34 పోలింగ్ కేంద్రంలో 938 ఓట్లు, 35 పోలింగ్ కేంద్రంలో 705 ఓట్లు, మొత్తం రెండు కేంద్రాలలో 1643మంది పట్టభద్రులు సోమ వారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ తెలి పారు. ఈ కేంద్రాలలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అన్ని మౌళిక సదుపాయాలు కల్పించా మని ఆమె తెలిపారు. అలాగే స్థానిక ఎస్ఐ ఎస్‌కె. మహ్మద్‌అలీ కేంద్రం వద్ద ఎలువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టిబంధోబస్తును ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం



విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కుసుంపురం గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని చింతల్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన యలమట్టి మహేష్ (వికలాంగుడు)కు అండగా నిలిచారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన మహేష్ ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తను చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతు న్నానని హైదరాబాదులో ఉన్న మాతృమూర్తి సంస్థ సభ్యులకి మహేష్ తెలియజేశారు. తక్షణమే స్పందించిన మాతృమూర్తి యువజన సేవా సంఘం 5వేలు సంస్థ సభ్యులు బొడ్డు నవీన్, బాబ్జీ, స్వామీ, ప్రవీణ్ చేతులమీదుగా అందజేశారు.

జస్వంత్ కుటుంబానికి ఆర్థిక సాయం



విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కవిటి కొత్తూరు గ్రామానికి చెందిన నీలగిరి జస్వంత్ ఇటీవలే ప్రమాదానికి గురయ్యారు.కే. కొత్తూరు గ్రామ జనసైనికులు ద్వారా విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన నాయకులు లొల్ల రాజేష్ 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపెవరిది...?

- కమలం వికసిస్తుందా...?
- సైకిళ్ పెరిగెడుతుందా...?
- స్వతంత్రులు సత్తా చాటనున్నారా...?
- మేధావుల ఎజండా ఏమిటి...?
- పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టనున్నారు...?

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : ప్రతిష్టాత్మకమైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారం జోరుగా సాగింది. ఎవరి ఎజెండా వారు వివరించారు. అయితే...! ఉపాద్యాలు, విద్యావంతులు ఎటువైపున్నారు అన్న విషయం మేధావలుకు కూడా అంతుపట్టడం లేదు. అన్ని పార్టీలు విస్తృతంగా ప్రచారం సాగించారు. కార్యకర్తలు జండాలుతో ఎవరి ఎజండా వారు వివరించారు. ఉద్యోగులు ప్రభుత్వ వ్యతిరేక వోట్ వేస్తారని అంతా అనుకున్నా..! చివరినిమసంలో జగన్ తీసుకున్న పీఆర్సీ పునరోద్ధరణకు ఉద్యోగులు నమ్ము తున్నారా...? అన్నది అర్థంకావటం లేదు. ముఖ్యంగా ఉపాద్యాలు చాపకింద నీరులా ప్రచారం నిర్వహించారు. అయితే ఎవరికీ సపోర్ట్ చేస్తున్నారన్నది ఉపాద్యాలు గుట్టు విప్పటం లేదు. విశాఖపట్టణంలో ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంత అయినట్లు వైసీపీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. మరి నిరుద్యోగులు వైసీపీని ఆకర్షిస్తారా...? ఫ్యాన్ స్పీడ్ పెరుగు తుందా..! ఇప్పటికే ప్రభుత్వ పథకాలు పల్లెలలో విస్తృతంగా మార్పు తెచ్చాయని, ప్రభుత్వ విధి విధానాలు ప్రజలుకు నచ్చాయని వైసీపీ నాయుకులు చెప్పుకొస్తున్నారు. సీతాంరాజు సుధాకర్ గెలుపు తధ్యమని వైసీపీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. టీడీపీ మాత్రం ఉపాద్యాలు, ఇతర ఉద్యోగులు, నిరుద్యోగ యువత ప్రభత్వానికి పూర్తిగా వ్యతిరేకంగా వున్నారని, ప్రభుత్వం నిర్వహించిన ఫేక్ సమ్మిట్ విద్యావంతులు తెలుసుకున్నారని, గెలుపు టీడీపీదే అని వేపాడ చిరంజీవి రావు అత్యధిక మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ పార్టీకి గ్రామా మండల స్థాయిలో నాయకత్వం లేదు కనుక గెలుపుకు అవకాశాలు తక్కువే అని చెప్పవచ్చు. అయితే ఇప్పటికే పి.వి.ఎన్. మాధవ్ ఒకసారి ఎమ్మెల్సీగా గెలిచిని అభ్యర్థి అవటం వలన మేధావులలో ఆలోచన తేవచ్చని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా ఇండిపెండెంట్ అభ్యర్థులు అయితే ముప్పై నలుగురు వున్నారు, వీరు ఎవరి ఓట్లను లాక్కుంటారో చూడాలి.

పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- ఎన్నికల విధులు పాల్గొనున్న పోలీస్ సిబ్బందికి దిశ నిర్దేశాలు
- ఎస్పీ జి. ఆర్. రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం/ఎచ్చెర్ల : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వ హించేందుకు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకో వాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక. సూచించారు. సోమవారం ఎన్నికల విధుల్లో పాల్గొనున్న సిబ్బందికి ఎన్నికల విధులపై ఆదివారం నగరంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఎస్పీ దిశ నిర్దేశాలు చేశారు. ఈ ఎన్నికల విధుల్లో జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు అదనపు ఎస్పీలు, ముగ్గురు డిఎస్పీలు, ఎనిమిది మంది సిఐలు తోపాటు ఎస్సైలు పోలీస్ సిబ్బంది, ప్రత్యేక దళాలు, ఆర్మ్ పోలీసులు, స్పెషల్ పార్టీలు సుమారుగా 800 పోలీసు సిబ్బంది ఈ ఎన్నికలు విధుల్లో పాల్గొంటున్నారు. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ లను నియమించామన్నారు. జిల్లాలో చెక్ పోస్టలను ఏర్పాటు చేశామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ఆదివారం సాయంత్రానికి పోలీస్ సిబ్బంది బ్యాలెట్ బాక్స్‌తోపాటు ఎన్నికల సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని సోమవారం ఉదయం ఎన్నికలు ప్రారంభమై ఎన్నికలు పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌లు ఎన్నికలు

సామాగ్రి స్ట్రాంగ్ రూముల వద్ద భద్రపరిచే వరకు అందరూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎస్పి సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సుమారుగా 100 మీటర్లు వరకు బౌందురి లైను వేసుకొని ఆ పరిధిలో ఎవరు కూడా గుంపులు గుంపులుగా ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎటువంటి వ్యక్తిగత స్వలాభంతో పాటు ప్రేరేపణకు గురికాకుండా పారదర్శకంగా ఎన్నికల విధులు అందరూ నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరూ రూట్ అధికారులు, మొబైల్ అధికారులతో పాటు ఇన్చార్జ్ అధికారుల ఫోన్ ఫోన్ నెంబర్లు దగ్గర ఉంచుకోవాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగిన తక్షణమే అధి కారులకు తెలియజేయాలని ఎస్పి సూచించారు. బ్యాలెట్ బాక్సులు తరలించే సమయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు మొబైల్ పార్టీలను రూట్ అధికారులు అలర్ట్ చేసి సక్రమం గా బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కేంద్రాలకు చేరుకు న్నట్లు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఓటర్లును క్యూలైన్‌లో క్రమ పద్ధతిలో అనుమతిస్తు మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, సంయమనం పాటిస్తూ వ్యవహరించాలన్నారు. ఓటర్లను పూర్తిగా తనిఖీ చేసి ఓటర్ స్లిప్ మరియు ప్రభుత్వం ఇచ్చిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును మాత్రమే ఓటర్‌తోపాటు పోలింగ్ బూత్ లోపలికి అనుమ తించాలన్నారు. ఎట్టి పరిస్థితులలో కూడా పోలీస్ సిబ్బంది పోలింగ్ బూత్ లోపలికి వెళ్ళరాదు. పిఓ, ఏపిఓ పిలిస్తేనే పోలింగ్ బూత్ లోపలికి వెళ్లాలి, పోలింగ్ బూత్ బయట బ్యారికేడ్‌లు, క్యూ లైన్ సిస్టంను సరిపడే విధంగా ఏర్పాటు చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు డిఎస్పి ఎం.మహేంద్ర సీఐలు, ఎస్ఐలు, ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రణస్థలం : దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డా.వైయస్ రాజశేఖర్ రెడ్డి సంక్షేమ పథకాలే జెండాగా, ప్రజల ఆశలే ఎజెండాగా రాజకీయ కుట్రలకు, అక్రమ కేసులకు తలొగ్గని, మాట తప్పని ఓ నాయకుని విశ్వసనీయతకు ప్రతీకగా పురుడు పోసుకున్న ప్రజల పార్టీ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ 13వ వసంతంలోకి అడుగుడుతున్న సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ దివంగతనేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో రణస్థలం మండలం జడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, జే.సి.యస్ ఇన్‌చార్జ్ చిల్ల వెంకటరెడ్డి, రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్ బాబు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బవిరి రమణ, చిత్రి విజయకుమార్, దుమ్ము యర్రయ్య, పొశపు ముకుందరావు, పిసిని లక్ష్మణ, దన్నాన సీతారాం, పతివాడ సత్యం, కలిశెట్టి కన్నంనాయుడు, టేకి బ్రహ్మాజీ, పల్లె లక్ష్మణ, భవిరి ప్రదీప్, సింక సూర్యారావు, గొర్లె రామునాయుడు, మైలపల్లి నాగేంద్ర, కరిమజ్జి రమణ, పిన్నింటి గౌరినాయుడు, ఉదయ, ఉపేంద్ర, మేస్త్రి లక్ష్మణ, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో : మండల కేంద్రంలోని వైయస్సార్సీపి ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు స్వగృహం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వైయస్సార్ సిపి పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తిచేసుకుని 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల నాయకుల ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ

ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైయస్సార్సీపి ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ నందిగామ మండలంలో పార్టీ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను తిలక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని న్నారు. మరో 30ఏళ్లు పాటు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగాలని

ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కుర్మాన బాలకృష్ణారావు, వైఎస్ ఎంపీపీలు ఆర్ కుర్మారావు, సువ్వారి వసంత్ కుమార్, మండల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరులో : వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఆదివారం మండల కేంద్రం కొత్తూరులో ఘనంగా జరిగాయి, పాతపట్నం నియోజకవర్గ నాయుకులు మండలపరిషత్ వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో స్థానిక ఒక ప్రయవేట్ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ముందుగా కిక్ కుట్ చెసారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ లోతుగెడ్డ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో వైస్సార్ పార్టీ సుస్థిరం, సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంకేమ పథకాలతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజల జీవన స్థితి గతులు మారాయి, సచివాలయాల ఏర్పాటుతో పాలనా వికేంద్రీకరణ జరిగిందని ఆయన అన్నారు. అనంతరం హాస్పిటల్‌లో రోగులకు పళ్ళు, రొట్టలును వైసీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కొత్తూరు మాజీ సర్పంచ్ లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, నాయుడు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్, హైస్కూలు కమిటీ చైర్మన్ వడం శ్రీనివాసరావు, టి.గోపి తదితరులు ఉన్నారు.

ఉమాకవికి జాతీయ శతాధిక ఉగాది పురస్కారం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జాతీయ శతాధిక ఉగాది సమ్మేళనంలో శ్రీకాకుళం సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షుడు డా.భోగెల ఉమామహేశ్వరరావును కోనసీమ జిల్లా అమలాపురం సర్ సి.వి.రామన్ కళాశాలలో నిర్వహించిన ఉగాది కవిసమ్మేళనంలో మొదటి ఆవృతానికి గ్రూప్ లీడర్‌గా ఇచ్చి గౌరవించారు. ఈసందర్భంగా ఉమాకవిని ఘనంగా సన్మా నించి, ఉగాది పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఉమాకవి చదివిన ఉగాది వచ్చింది-ఉషస్సులు ఎన్నో తెచ్చింది అనే కవిత ఎంతగానో అలరించింది. ఈకార్యక్రమంలో శ్రీశ్రీ కళావేధిక జాతీయ, అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ చేతులు మీదుగా పురస్కారం అందున్నారు. ఈ కార్యక్రమంలో చిట్టి లలిత, కె.రమావతి, మోటూరి నారాయణరావు, పాలక దేవానంద్, బి.వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం రద్దు

ఎస్పీ జి.ఆర్.రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : పోలీసు శాఖ సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జి. అర్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల మరియు స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని ప్రకటనలో కోరారు. వ్యయప్రసాలు ఖర్చు చేసి జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె కోరారు.

కార్మిక ఐక్య సంఘీభావంతో మెలగాలి

విశాలాంధ్ర-పొందూరు : కార్మిక సంఘాలు సంఘటిత సంఘీభావంతో మెలిగి అవసరమైన కార్యక్రమాలు నెరవేర్చుకోవాలని పొందూరు టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు కొన్న సత్తిబాబు అన్నారు. మండల కేంద్రంమార్కెట్ యార్డ్ సమీపంలో ఆదివారం నిర్వహించినటూ వీలర్స్ మెకానికల్ అసోసియేషన్ విస్తృత సమావేశంలో మాట్లాడుతూపై విధముగా అన్నారు. బైక్ మెకానికల్ కార్మికులు సమస్యల సాధన కోసం అందరూ స్నేహభావంతో మెలిగి ఐక్యతకు చాటి చెప్పుకోవలసిన అవసరం ఉందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా టూ వీలర్స్ మెకానికల్ అసోసియేషన్ అధ్యక్షులు కోటిపల్లి మోహనరావు మాట్లాడుతూ ప్రతి మెకానికల్ ప్రజలతో మమేకమై పనిచేసి కార్మిక జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని ఆయన కోరారు. ఏ కార్మికులకు సమస్య వచ్చినా అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని పరిష్కారానికి శాంతియుతమైనటువంటి మార్గ%శీ% లో నడవాలన్నారు. టూ వీలర్స్ మెకానికల్ అసోసియేషన్ సమస్యలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆముదలవలస బైక్ మెకానికల్ యూనియన్ అధ్యక్షులు వంశీ కోరారు. సమస్యలపై సంఘటిత పోరాటమే సారన్యమని అందుకు జిల్లాలో అనేక మండలాల్లో బైక్ వర్కర్స్ యూనియన్ లను ఏర్పాట్లు చేస్తున్నామని రణస్థలం యూనియన్ అధ్యక్షులు ఈశ్వరరావు అన్నారు. రాజాం మండలం నుండి కృష్ణ చిలకపాలెం యూనియన్ అధ్యక్షులు జీవా లు బైక్ మెకానిక్ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరంమండల బైక్ మెకానికల్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారాన్ని చేశారు. పొందూరు మండల టూ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొన్న సత్తిబాబు, దాన్నన సూరిబాబు, ట్రజరర్ గా జి చిరంజీవి లతో పాటు పలువుర కార్యవర్గ సభ్యులను జిల్లా యూనియన్ అధ్యక్షులు కోటిపల్లి మోహనరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకరణ చేయించారు. కార్యక్రమంలో మండల నలుమూలల నుండి బైక్ వర్కర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు



- ఉదయం 9 నుంచి భానుడి ప్రతాపం
- అలమటిస్తున్న ప్రజలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఎండలు మండుతున్నాయి. వేసవి ప్రారంభం నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఇప్పుడే ఇలా ఉంటే నడి వేసవిలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. గ్రామాల్లో ఉదయం వేళ దట్టంగా పొగమంచు కురుస్తున్నది. 9 గంటల నుంచి ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతున్నది. కొద్ది రోజులుగా 38 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదవు తుండగా శని, ఆదివారాల్లో 39 డీగ్రీలు నమోదైంది. రానున్న రాజుల్లో వేడి ఎక్కువగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ రెవన్యూ విభాగం తెలి పింది. ఈ నెలాఖరు నుంచి ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావారణశాఖ తెలిపింది. ఎండతో మధ్యాహ్నానికి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు వేసవిలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, వృద్ధులు, చిన్నారులు వీలైనంత వరకు ఇంటి పట్టునే ఉండాలన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుంటే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఫీజులు కట్టలేదన్న నెపంతో ఏ ఒక్క ఇంటర్మీడియట్ విద్యార్థికి హాల్ టికెట్లు నిరాకరించినట్లు ఫిర్యాదు అందినా, విద్యా సంవత్సరం కోల్పోయినట్లు గుర్తించినా ఆయా కళాశాలల గుర్తింపును 2023-24 విద్యా సంవత్సరం నుండి రద్దు చేసేందుకు సిఫారసులు చేయనున్నామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం అన్నారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు దగ్గరపడుతున్నా చివరి నిముషం వరకు విద్యార్థులను మానసికంగా ఫీజులు పేరిట వేధిస్తున్నట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి తమకు అందుతున్న ఫిర్యాదులను పరిశీలనలోకి తీసుకొని ఆయా యాజమాన్యాలపై అవసరమనుకుంటే క్రిమినల్ చర్యలకు కమిషన్ తరపున సిఫారసులు చేయనున్నామని అన్నారు. అలాగే పరీక్షలు జరిగే ప్రతీ కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు, దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు లేమిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి అందే ప్రతీ ఫిర్యాదును యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్ఐఒ లకు ఆదేశాలు జారీచేస్తున్నామని అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన టోల్ ఫ్రీ నెంబర్ 1800 4257635తోపాటు (ఏపీఎస్‌సీపీసీఆర్ 2018 ఎట్‌ది జీమెయిల్ డాట్‌కామ్)కు ఫిర్యాదులు అందిస్తే చర్యలు చేపట్టేందుకు కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిద్ధంగా ఉందని సీతారాం చెప్పారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-టెక్కలి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిర్భావ దినోత్సవం ను ఎమ్మెల్సీ, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి జడ్పిటిసి సభ్యురాలు దువ్వాడ వాణి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 12 వసంతాలు పూర్తి చేసుకొని 13 వ వసంతం లోకి అడుగు పెడుతున్న సందర్భంగా టెక్కలి లో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఆవరణంలో పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు.అనంతరం టెక్కలి వైఎస్ఆర్ సీపీ పార్టీ కార్యలయం ప్రాంగణంలో నియోజకవర్గం స్థాయిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందస్తుగా ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల పరిషత్ అధ్యక్షులు,జెడ్పీటీసీ సభ్యులు, పిఎసిఎస్ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, జెసిఎస్ మండల ఇంచార్జ్ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, వార్డ్ మెంబర్లు, వివిధ హెూదాలలో గల సీనియర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోంపేటలో : సోంపేట పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంపీపీ నిమ్మన దాసు, జెడ్పీటిసి తడక యశోద, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు, పలాసపురం గ్రామపంచాయతీ సర్పంచ్ తడక జోగారావు బస్టాండ్ వద్ద మహానేత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు, పలాసపురం గ్రామపంచాయతీ సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో గడచిన 12 ఏళ్లలో ఎన్నో సవాళ్లను అధిగమించి, సంపూర్ణ ప్రజాబలంతో ప్రభుత్వం ఏర్పాటు చేసి, అధికారంలోకి వచ్చాక కేవలం రెండున్నరేళ్లలోనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దాదాపు అన్ని హామీలు అమలు చేయడమే కాక చెప్పని హామీలతో పాటు అనేక సంక్షేమకార్యక్రమాల అమలు ద్వారా ప్రజారంజకంగా పరిపాలన చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రతినిధి రేగు బాలయ్య, వార్డు మెంబర్లు తోట ఢిల్లీ, కోళ్ల తిరుపతి, భీమారావు, తెల్లి వైకుంఠరావు, తేజ పట్నాయక్, టెంక రాజు, బత్తుల శంకర్, రమేష్, వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన హృదయ నేత.. డా.వై.ఎస్.ఆర్ : జిల్లా వైసిపి అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేటలో : దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి, డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జన హృదయ నేతని జిల్లా వైసిపి అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి నేటికి 12వసంతాలు పూర్తి చేసుకున్న సంధర్భంగా ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయం ఆవరణలో దివంగత వై.ఎస్ విగ్రహానికి నియోజకవర్గ ఎమ్మెల్యే, కృష్ణదాస్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా ఎన్నికైన డా.రాజశేఖర్ రెడ్డి భారతదేశంలో ఏ రాష్ట్రంలో అమలులో లేని ఆరోగ్యశ్రీ పథకాన్ని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, డిసిసిబి ఛైర్మన్, కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పిటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి నాయకులు, కెసిహెచ్‌బి.గుప్తా, చింతు రామారావు, వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు, బగ్గు రమణయ్య, కణితి కృష్ణారావు, ధర్మాన జగన్మోహన్‌రావు, శిల్లా మనోహర్, బి.ఎస్.శర్మ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

కోటబొమ్మాళిలో : పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, దుక్కరోజారామక్రిష్ణలు అన్నారు. పార్టీ అవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను అవిష్కరణ, అవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనం గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. అలాగే మండల విఫ్ బద్దు అప్పన్న, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జీ గద్దవలస నాగభూషణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులుతో పెద్దఎత్తున వచ్చి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు పండ్లు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోయిన క్రిష్ణారావు, ఇర్రి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలో గల జిల్లా పార్టీ కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ జెండాను ఎగరవేసిన దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలకు జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి. వేడుకలకు హాజరైన కళింగ కార్పొరేషన్ చైర్ పర్సన్ పేరాడ తిలక్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మెంటాడ పద్మావతి, డాక్టర్ దానేటి శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు మార్పు పృథ్వి, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ చల్లా అలివేలు మంగ, అందవరపు ప్రసాద్, మండవల్లి రవి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగు శారద, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుగుణ రెడ్డి, నందిగం ఎంపీపీ శ్రీరామమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు బాలకృష్ణ, మహమ్మద్ సిరాజుద్దీన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బెందాలం పద్మావతి తదితరులు ఉన్నారు.

ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచిన పార్టీ 'వైకాపా'

విశాలాంధ్ర-చింతపల్లి : ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచిన పార్టీ యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావులు అన్నారు. ఆ పార్టీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తిచేసుకుని 13వ ఏట అడుగిడిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత నివాస గృహ ఆవరణ లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ముందుగా కేక్ కట్ చేసిన వారు పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించిన తొలినాళ్లలో అధికార పార్టీలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న పార్టీ శ్రేణులు ఎక్కడ ప్రలోభాగాలకు లొంగకుండా పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. నాడు తక్కువ మంది కార్యకర్తలతో మన్య ప్రాంతంలో పార్టీని విస్తరింపజేసి పాడేరు నియోజకవర్గం నుంచి వైకాపా శాసన సభ్యురాలిగా గిడ్డి ఈశ్వరిని గెలిపించు కోవడం జరిగిందని, ప్రలోభాలకు లొంగిన ఆమె పార్టీని వేయడం జరిగిందన్నారు. ఆమె స్థానాన్ని ఎవ్వరూ భర్తీ చేయలేరు అని భ్రమించిన తరుణంలో కార్యకర్తలకు నేనున్నానంటూ కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి భరోసా కల్పించి బరిలోకి దిగారన్నారు. అప్పట్లో పార్టీ బలోపేతానికై ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న భాగ్యలక్ష్మి రాజకీయ చతురత ప్రదర్శించి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకొని 2014 ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించడం జరిగిందన్నారు. మన్య ప్రాంతంలో వైకాపాకు ఎదురులేదన్నారు. ఎన్ని పార్టీలు ఆవిర్భవించినా మన్యంలో గిరిజనులందరూ వైకాపా వైపే ఉంటారని, ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తారని వెంకటరావు ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, తెదేపాలు వైకాపా శ్రేణులను చిత్రహింసలకు గురిచేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరూ పార్టీని వీడకుండా పార్టీ గెలుపుకు కృషి చేశారని భాగ్యలక్ష్మి కొనియాడారు. అదే తరహాలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మన్య ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ఉపయోగముంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు వారి స్వార్థం కోసం పనిచేశారని, మన్య ప్రాంత అభివృద్ధికి వారు చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. ఆనాటి ప్రభుత్వాలు చేసిన తప్పొప్పులు కారణంగా ఈనాడు మారుమూల గ్రామాలకు విద్యా, వైద్యం, రవాణా, రహదారి, త్రాగునీటి కల్పనకు నోచుకోలేని ఎన్నో ప్రాంతాలు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కనీస మౌలిక వసతులకు నోచుకున్నాయని ఇటువంటి వాటిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యావంతులు, పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ సీతం రాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి మాడుగుల జడ్పిటిసి సభ్యురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, చింతపల్లి, గూడెం కొత్త వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి, జీకే వీధి మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అరకు ఇర్మియ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, వివిధ పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం జగన్ విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

విశ్వబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు హనుమంతురావు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతురావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల పైగా ఉన్న విశ్వబ్రాహ్మణుల కు 28 సమస్యలు ఉన్నాయని వాటిపై ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చామని అయినప్పటికీ అవి పరిష్కార రూపం దాల్చలేదన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన నాలుగు హామీలు కూడా అమలుకు నోచుకోలేదన్నారు. మంగళ సూత్రాలు తయారీ హక్కు విశ్వబ్రాహ్మణులకు, స్వర్ణకారులకు ఉండేలా చట్టం చేస్తామని, 272 జీవో రద్దు చేస్తామని, బంగారం అమ్మకాల ద్వారా వచ్చే సెస్ లో రెండు శాతం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ కు కేటాయిస్తామని, ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయిస్తామని హామీలు హామీలుగానే మిగిలిపోయాయని అన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణులను విస్మరించడం తగదన్నారు, విశ్వబ్రాహ్మణులను విశ్వబ్రాహ్మణుల గానే పిలవాలని అన్నారు. తిరుపతిలో వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి ఎకరం స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వబ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ,మండల స్థాయిలలో ఇప్పటికే కమిటీలను నియమించమని తెలిపారు. అందులో భాగంగానే ఏప్రిల్ 9న చోడవరం నియోజవర్గంలో నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. చోడవరం సభను మరో శంఖారావంగా హనుమంతురావు అభివర్ణించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహ చారి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దిమిలి రాజేష్ ,ప్రధాన కార్యదర్శి గానుగుల బాబ్జీ, కన్వీనర్ కోలాంటి రాజు, అనకాపల్లి పట్టణ కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు వానపల్లి కోటేశ్వరరావు, కొమ్మోజి గోవిందరాజు, గానుగుల రమణ, చుక్క వెంకట సత్తిరాజు, సింహాద్రి శ్రీధర్, సుక్కా సత్తిబాబు, వేమవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా వైఎస్సార్ పార్టీ వ్యస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టి 13వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా జరిపారు,పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ, జెడ్పిటిసి వదుగులజ్యోతి స్థానిక గాంధి బొమ్మ సెంటర్ లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 12 ఏళ్లుగా సీఎం జగన్ పార్టీని నడుపుతున్నారని, ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు,జెడ్పిటిసి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా సంస్కరణలు,ఎవరూ చేయని రీతిలో ఉద్యోగాల భర్తీ చేశారని, సచివాలయ వ్యవస్థతో పరిపాలన స్వరూపాన్ని మార్చేశారని, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించారని, ప్రజలకు జవాబుదారీగా సీఎం జగన్ గారు ప్రభుత్వం నడుస్తోంది అన్నారు,ఈ కార్యక్రమంలో కొంగర మురళి కృష్ణ కనిగిరి దుర్గాప్రసాద్, కుశరాజు, ఎంపీటీసీలు,వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు గృహ సారదులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రాజకీయ ఉద్దండుడు రాజగోపాల్ రావు

- మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్

విశాలాంధ్ర -ఆమదాలవలస : ప్రజాక్షేత్రంలో ప్రజల మనసులు గెలిచిన రాజకీయ వద్దంటుడు స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటానని మాజీ మున్సిపల్ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్ అన్నారు. అక్కులపేట గ్రామంలో బొడ్డేపల్లి రాజ గోపాలరావు జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సేవలో ప్రజల మనసులు గెలిచిన లెజెండరీ నాయకుడు రాజగోపాల్ రావు అని అన్నారు. ఆయన రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానని రమేష్ స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధిలో బొడ్డేపల్లి మార్క్ ప్రజలందరికీ సుస్పష్టం మన్నారు. వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, తాత గారి ఆశయాలకు అనుగుణంగా రాజకీయ వారసత్వాన్ని నిలబెడతానని రమేష్ స్పష్టం చేశారు. ఆయనతోపాటు అక్కులపేట, ఎస్ ఆర్ సి పేట, ఇతర గ్రామాల సర్పంచులు, ప్రతినిధులు, బొడ్డేపల్లి అభిమానులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

విశాలాంధ్ర -శ్రీకాకుళం రూరల్ : మండలం సింగుపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహిళా రైతులతో నవధాన్యాలు సాగు నేలతల్లికి బాగు అంటూ ప్రకృతి సేద్యంలో పలు పంటల విధానాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ముఖ్యంగా నేలలో 30 రకాలకు పైగా విత్తనాలను వేసుకోవడం వలన నేలలో పంటలకు అవసరమైన ముఖ్య పోషకాలు అన్నీ కూడా సమృద్ధిగా అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే భూమి లోపల కార్బన్ శాతం పెరిగి జీవవైవిధ్యం అనేది ఏర్పడుతుందని, ఈ విధంగా రైతులందరూ కూడా ప్రకృతి సేద్యంలో పలు పంటలను పండిస్తూ నేల సారవంతంగా మారడంతో పాటు రైతులుకు అదనపు ఆదాయం కూడా వస్తుందని సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రావు, కల్పన, ఈశ్వర్, శివశంకర్ పాల్గొన్నారు.

ఎంపీటీసీలతో వైసీపీ అభ్యర్థి నర్తు సమావేశం

విశాలాంధ్ర -కొత్తూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఎల్సీ అభ్యర్థిగా వైసీపీ పార్టీ బలపరి చిన నర్తు రామారావు ఆదివారం కొత్తూరులో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వర ప్రసాద్‌రావు కెంప్ కార్యాలయంలో సమావేశ మయ్యారు. ఈఎన్నికల్లో తనను గెలిపించాలని ఓటర్లుగా నున్న ఎంపీటీసీ లను నర్తు అభ్యర్ధించారు. ఆయనతో సమావేశమైనవారిలో ఎంపీపి సవర సావిత్రి, పదిమంది ఎంపీటీసీలున్నారు. కాగా తామంతా పార్టీకి కట్టుబడి పార్టీ అదేశామనుసరం అభ్యర్థిగా నున్న నర్తు రామారావుకే ఓటు వేస్తామని స్థానిక సమస్తల అబ్యర్థి నర్తుతోపాటు పట్టబద్రుల ఎమ్మెల్సి పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు తధ్యమని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ అన్నారు.

జాడుపూడి చర్చిలో ఉపవాస సదస్సు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని జదుపూడి ఈస్టర్ బిలివర్స్ చర్చిలో పాస్టర్స్, విశ్వాసుల ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు శ్రీప్రతి అన్వేష్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన రెడ్డి క్రైస్తవులకు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న 10 వేల మంది పాస్టర్స్ ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున్న అందజేస్తున్నదని అన్నారు. ఇతర దేశాలలో చదువుకొనే క్రైస్తవ విద్యార్థులకు సంవత్సరమునకు 5లక్షలు అందజేస్తున్నారని తెలిపారు.జెరుషలేము వెళ్ళే పాస్టర్స్ కి రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలియ జేశారు.క్రైస్తవుల సంక్షేమానికి పథకాలు ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి కి క్రైస్తవుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ అధ్యక్ష పదవి రావడానికి సహకరించిన మేడిద జాన్సన్, బిషప్ కుమారి, జిల్లా మంత్రి వర్యులు దర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియ సాయిరాజ్, ఇచ్ఛాపురం పురపాలక చైర్పర్సన్ పిలక రాజ్యాలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలి

విశాలాంధ్ర-కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా మన్య వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని మానవ హక్కులు నేర నిరోధక సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంబిడి కృష్ణకుమారి డిమాండ్ చేశారు. జిల్లాలోని కొయ్యూరు మండలం కొమ్మిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని మాతే సువర్ణ ఆకస్మికంగా మృతి చెందడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి జిల్లా వ్యాప్తంగా పలు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల వరుస మరణాల పరంపర కొనసాగుతూనే ఉందన్నారు. మరణాల నివారణకు అధికారుల చర్యలు మాత్రం శూన్యంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. గతంలో ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎం హెల్త్ అసిస్టెంట్లు పనిచేసే వారని వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆశ్రమాలలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బందిని తొలగించడం వల్ల గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ చర్యలు కొరవడ్డాయని ఆరోపించారు. వరుస మరణాలు సంభవిస్తున్న ఇటు జిల్లా అధికారులు గానీ అటు ప్రభుత్వం గానీ స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహిస్తూ బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవడంతోపాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పిల్లలను ఆశ్రమాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపించాలి తప్పితే పాఠశాలకు పంపేందుకు భయపడాల్సిన పరిస్థితి రాకూడదని ప్రస్తుతం మన్యంలో ఇదే పరిస్థితి కొనసాగుతోందని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఐటిడిఏ పిఓ ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆశ్రమాలలో విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని కృష్ణకుమారి విజ్ఞప్తి చేశారు.